

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి - పోలవరం

గత కొన్ని రోజులుగా పెరుగుతూ తగ్గుతూ దోబూచులాడిన గోదావరి నీటిమట్టం ఆదివారం నాటికి తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన గోదావరి నీటిమట్టం 31.510 మీటర్లు, దిగువన 22.800 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు ఇఇ మల్లికార్జునరావు తెలిపారు. స్పిల్ వే నుంచి 7,58,919 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. గోదావరి నీటిమట్టం తగ్గి కడెమ్మ స్లూయిజ్ గేట్లు వరద నీరు నుంచి బయట పడడంతో ఏజెన్సీకు కుడివైపున ఉన్న పంట పొలాలు వరద జలాల నుంచి బయటపడ్డాయి. రైతులు ఇతర ప్రాంతాల నుంచి నారుమళ్లు తెచ్చి ఊడ్పులకు సమాయత్తమవుతున్నారు. ఎల్ఎన్‌డిపేట కొవ్వాడ రిజర్వాయర్ వద్ద నీటిమట్టం 89.80 మీటర్లు నమోదైందని, 120 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు సిబ్బంది తెలిపారు.

ధాన్యం కొనుగోలులో.. సమస్యలు తీరేనా..!

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై అధికారుల ప్రణాళికలు


రెండు జిల్లాలో 10.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా

511 రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలుకు ఏర్పాట్లు

గతంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులపై స్పష్టత కరువు

తూకం, తేమశాతంపై కచ్ఛితమైన ప్రకటన నిల్

ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొన్న సమస్యలను ప్రభుత్వం గుర్తించిందా? గతంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుందా? తేమ, తూకంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు తీసుకున్న చర్యలు ఏంటి? అన్న ప్రశ్నలు అన్నదాతను వేధిస్తున్నాయి. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై ముందస్తు ప్రణాళికలకు అధికారులు సిద్ధమవ్వడంతో రైతుల్లో ధాన్యం కొనుగోలుపై చర్చ మొదలైంది. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు గుర్తించి.. రైతులకు సులువుగా ధాన్యం విక్రయించుకునే అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అక్టోబర్ రెండోవారం నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 5.60 లక్షల మెట్రిక్ టన్నులు, 'పశ్చిమ'లో 5.30 లక్షల మెట్రిక్ టన్నులు మొత్తం 10.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏలూరు జిల్లా పరిధిలో 247, పశ్చిమలో 264 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెబుతున్నారు. ఇక్కడ వరకు భాగానే ఉంది. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులకు సంబంధించి అధికారుల సమావేశాల్లో స్పష్టత రాని పరిస్థితి నెలకొంది. వైసిపి ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలులో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యం విక్రయించడం రైతులకు పెద్ద సమస్యగా ఉండేది. రైతులు ధాన్యం మాసూళ్లు చేసిన తర్వాత, ఆరబెట్టి రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకున్న తర్వాత సంచులు సకాలంలో అందేవి కావు. ధాన్యం మిల్లుకు తరలించేందుకు వాహనాలకైన నానా యాతన పడేవారు. మిల్లు వద్దకు ధాన్యం చేరిన తర్వాత తూకం సరిపోలేదని, తేమ శాతం ఎక్కువగా ఉందని రైతుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. డబ్బులు ఇవ్వకపోతే ధాన్యం దిగుమతి చేసుకునేవారు కాదు. ధాన్యం సొమ్ములు తొలుత వేగంగా జమైనప్పటికీ తర్వాత నెలల తరబడి జమచేయని పరిస్థితి కొనసాగింది. దీంతో రైతులకు ధాన్యం అమ్ముకోవడం ఒక యజ్ఞంలా మారేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ధాన్యం కొనుగోలులో సమస్యలు లేకుండా చూస్తామంటూ రైతులకు భరోసా ఇచ్చింది. ధాన్యం కొనుగోలుపై అధికారులు చేస్తున్న సమీక్ష సమావేశాల్లో వారు ఎదుర్కొన్న సమస్యలపై పరిష్కారం మాత్రం స్పష్టంగా చెప్పడం లేదన్న చర్చ నడుస్తోంది.

తేమ, తూకంపై స్పష్టత లేదాయె..

గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రం అధికారులు వచ్చి ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించేవారు. 17 శాతంలోపు తేమశాతం ఉందని గుర్తించిన తర్వాత ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేవారు. మిల్లు వద్దకు వెళ్లిన తర్వాత తేమశాతం ఎక్కువగా ఉందని, మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకునేవారు కాదు. తేమశాతం అధికంగా ఉందంటూ పాయింట్లు వారీగా రైతుల నుంచి సొమ్ములు వసూలు చేసేవారు. రైతు భరోసా అధికారులు తేమ శాతం నిర్ధారించిన తర్వాత తేమశాతం ఎక్కువగా ఉందని మిల్లర్లు ఏవిధంగా చెబుతారో ఏ ఒక్కరికీ అర్థంకాని పరిస్థితి. ప్రభుత్వ అధికారులు తేమ శాతం నిర్ధారించిన తర్వాత కూడా మిల్లర్లు అందుకు విరుద్ధంగా వ్యవహరించి రైతుల నుంచి అడ్డంగా దోచుకున్న పరిస్థితి నెలకొంది. జిల్లా పరిషత్ సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు అనేకసార్లు అధికారులను నిలదీసిన పరిస్థితి సైతం కొనసాగింది. రైతు సేవా కేంద్రంలోని అధికారులు తేమశాతం గుర్తించాక మిల్లర్లు అడ్డంకులు సృష్టించకుండా తీసుకున్న చర్యలు ఏంటో అధికారులు చెప్పాల్సి ఉంది. రైతు భరోసా కేంద్రం అధికారులు తూకం నిర్ధారణ చేసిన తర్వాత తూకం తక్కువగా చూపించి రైతుల నుంచి డబ్బులు వసూలు చేయడాన్ని నివారించేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో కూడా అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. సంచులు, వాహనాల విషయంలో అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కొనసాగేది. ఈ సారి అటువంటి పరిస్థితి రాకుండా ఏవిధంగా ముందుకు సాగుతారో తేల్చి చెప్పాల్సి ఉంది. కళ్లల్లోనే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలి. 48 గంటల్లో ధాన్యం సొమ్ములు జమ కావాలంటే, ఆన్‌లైన్ విధానం ఏవిధంగా త్వరితగతిన పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటో రైతులకు వివరించాల్సి ఉంది. గతంలో నెలకొన్న సమస్యలపై స్పష్టత ఇచ్చి రైతులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేకపోతే అవే సమస్యలతో రైతులు మళ్లీ ఇబ్బందులు పడాల్సి వస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ఆర్‌ఐఒ కె.చంద్రశేఖర్ బాబు





ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థుల నుంచి ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. జిల్లాలో ఏయే యాజమాన్యాల పరిధిలో ఎన్నికళాశాలలు ఉన్నాయి? ఈ సంవత్సరం ఎన్ని అడ్మిషన్లు జరిగాయి? ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఏమైనా చర్యలు తీసుకున్నారా వంటి ప్రశ్నలకు ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న : జిల్లాలో మొత్తం ఎన్ని ఇంటర్మీడియట్ కళాశాలలో ఉన్నాయి? అందులో ప్రభుత్వ కళాశాలలు ఎన్ని ఉన్నాయి?

జిల్లాలో మొత్తం 145 ఇంటర్మీడియట్ కళాశాలలు ఉండగా అందులో 19 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. అలాగే ఆరు సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ కళాశాలలు, మూడు గిరిజన సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ కళాశాలలు, మూడు కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు, 33 హైస్కూల్ ప్లస్, రెండు ఎయిడెడ్ కళాశాలలు ఉండగా, 81 ప్రయివేటు కళాశాలలు ఉన్నాయి.

ప్రశ్న : జిల్లాలో మొత్తం ఎంతమంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు? ఈ సంవత్సరం ఎన్ని అడ్మిషన్లు జరిగాయి? వాటిలో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు ఎన్ని?

మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 35,930 మంది విద్యార్థులు ఉండగా మొదటి సంవత్సరం విద్యార్థులు 19,925 మంది ఉన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో 2,396 అడ్మిషన్లు జరిగాయి.

ప్రశ్న : ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఏమైనా చర్యలు తీసుకున్నారా?

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఆయా కళాశాల పరిధిలో అధ్యాపకులు క్యాంపెయిన్ చేశారు. అలాగే అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య ప్రభుత్వ కళాశాలల్లో దొరుకుతుందనే విషయాన్ని బ్యానర్ల ద్వారా ప్రచారం చేశాం. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం అడ్మిషన్లు పెరిగాయి.

ప్రశ్న : ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యత పెంచేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఈ సంవత్సరం ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి అదనపు తరగతులు నిర్వహించాం. యూనిట్, క్వార్టర్లీ, ఆఫ్ ఇయర్లీ వంటి పరీక్షలు గతంలో ఆయా కళాశాలల పరిధిలో జరిగేవి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే పేపర్ ఇవ్వడమే గాక మార్కులు ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయడం జరుగుతోంది. తద్వారా మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులను గుర్తించి వారి పేరెంట్స్‌తో మాట్లాడమేగాక నేరుగా ఇంటర్మీడియట్ కమిషనర్ ఆయా అధ్యాపకులతో మీటింగ్ ఏర్పాటు చేసి తగు సూచనలు చేయడం జరుగుతోంది.

ప్రశ్న : ర్యాగింగ్, మాదకద్రవ్యాల వినియోగం వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నారా?

అన్ని కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేశాం. అలాగే ఈవ్ టీజింగ్, మాదకద్రవ్యాల వినియోగం, ర్యాగింగ్ విషయాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తున్నాం.

ప్రశ్న : ప్రస్తుతం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏయే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి?

ఈ సంవత్సరం అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకూ టెక్స్ట్, నోట్ పుస్తకాలు, బ్యాగులు ఉచితంగా అందించాం. కొత్త ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో తల్లికి వందనం గురించి ఇంకా ఎలాంటి ఆదేశాలు వెలువడలేదు.

ప్రశ్న : అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్ని సబ్జెక్టులకు సరిపడా అధ్యాపకులు ఉన్నారా? సిబ్బంది కొరత ఉందా?

ప్రభుత్వ కళాశాలల్లో ఎలాంటి అధ్యాపకుల కొరతా లేదు. రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకులు అన్ని సబ్జెక్టులకు సరిపడా ఉన్నారు. సిబ్బంది కొరత లేదు.

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

17 నుంచి అక్టోబర్ 2 వరకూ

సమిష్టిగా ముందడుగు వేయాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవా 2024 నిర్వహిస్తున్నామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మహాత్మా గాంధీ వారసత్వాన్ని గౌరవిస్తూ, స్వచ్ఛతను మన జీవన విధానంగా మార్చుకునేలా సమిష్టిగా ముందడుగు వేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జిల్లాస్థాయిలో భాగస్వామ్య సంస్థలతో ఇప్పటికే ఉన్నత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచి పోతుందన్నారు. మహాత్ముడి జయంతి వేళ ప్రతి సంవత్సరమూ అక్టోబర్ 2వ తేదీన స్వచ్ఛ భారత్ దివస్‌గా పాటిస్తున్నామన్నారు. 'స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత' ఇతివృత్తంగా స్వచ్ఛతా హి సేవ 2024ను నిర్వహించుకుంటున్నామన్నారు. స్వచ్ఛత లక్షిత్ ఏకాయి - సంపూర్ణ స్వచ్ఛత విభాగంలో అధిక జనసాంద్రత కలిగిన ప్రదేశాల్లో సామూహిక పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతూ, పరిశుభ్రత లక్ష్య సాధన కోసం ప్రత్యేకించి ఒక ప్రాంతాన్ని లేదా పారిశుధ్య సమస్యను ఎంపిక చేసుకుని దానికి పరిష్కారాన్ని చూపుతామన్నారు. సఫాయిమిత్ర సురక్ష విభాగంలో పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం, గౌరవాన్ని కాపాడేలా విభిన్న కార్యక్రమాలు చేపడతామన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు, 18న స్వచ్ఛత పరుగులు, బ్లీచింగ్, దోమల నివారణ మందులు పిచికారీ, నీరు నిలిచిపోయే ప్రదేశాలను శుభ్ర పర్చడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స శిక్షణ ఉంటుందన్నారు. 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞలు, డంప్‌ల గుర్తింపు తొలగింపు, పారిశుధ్య కార్మికుల గుర్తించి వారిని మంజూరైన పథకాలతో అనుసంధానం ఉంటుందని తెలిపారు. 20న మొక్కల పెంపకం, 21న అవగాహన ప్రచారాలు, ర్యాలీలు, పరిశుభ్రత డ్రైవ్, పార్కులను శుభ్రపర్చడం, నిర్వహణ, అభివృద్ధి, పిపిఇ కిట్లు, సేఫ్టీ గేర్లు పంపిణీ నిర్వహిస్తారని తెలిపారు. 2న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాలువలు, డ్రెయిన్లను శుభ్రపర్చడం, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తారని తెలిపారు. 23న వర్షపు నీటి నిల్వ, నిర్మాణాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు, రహదారుల శుభ్రత, 24న తాగునీటి నిర్మాణాల శుభ్రత, నిర్వహణపై అవగాహన ప్రచారాలు, నీటి నమూనాలను పరీక్షించడం, భద్రత, వ్యక్తిగత రక్షణపై సఫాయి మిత్రలు వారి కుటుంబాలకు అవగాహనా కార్యక్రమాలు ఉంటాయని, 25న వీధి నాటకాలు, మార్కెట్ ప్రాంతాలను శుభ్రపర్చడం, 26న అవాంఛిత యాప్‌లను క్లియర్ చేయడం, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, సంస్థాగత భవనాలు శుభ్రపరచడం, పిల్లల సంరక్షణ కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. అక్టోబరు 1న విద్యాసంస్థల్లో స్వచ్ఛ హ్యాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపర్చడం, శానిటేషన్ కార్మికులు, ఇతరుల గుర్తింపు, సన్మాన కార్యక్రమాలు చేపడతారని తెలిపారు.



కలెక్టర్ వెట్రి సెల్వి

గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్రంలో మేకలు, గొర్రెలకాపరుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, పౌర సమాచార సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం మండలం గోగులంపాడులో ఆదివారం ఏర్పాటు చేసిన గొర్రెల వైద్య శిబిరంలో గొర్రెల నట్టల నివారణ మందులు, వ్యాక్సినేషన్ కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గొర్రెల కాపరులకు దానామృతం, రేషన్ పంపిణీ చేసి వారిని పలకరించి మాట్లాడారు. మండలంలో 16 గ్రామాలతో పాటు వాటి శివారు గ్రామాల్లో 33 వేల గొర్రెలు, 420 మంది రైతులు ఉండగా, గోగులంపాడులో 3 వేల గొర్రెలు ఉన్నాయని తెలిపారు. ప్రతి మూగజీవికీ నట్టల వ్యాధి నివారణకు టీకాలు వేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గొర్రెల కాపరులను ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. గొర్రెల్లో నట్టల వ్యాధి నివారణకు అవసరమైన అన్ని రకాల మందుల పంపిణీకి తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెల కాపరులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. గొర్రెల కాపరులు ప్రభుత్వ రాయితీలను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం గొర్రెల కాపారులకు రూ.కోటీ వరకూ రుణాలిస్తోందన్నారు. వాటిలో 50 శాతం సబ్సిడీ కుడా ఇస్తుందని, తద్వారా గొర్రెల పామ్స్ నిర్మించుకొని ఆర్థికంగా స్థిర పడొచ్చని సూచించారు. అంతేగాక గొర్రెల ఫామ్స్ ద్వారా గొర్రెలు దిగుమతి త్వరగా వచ్చి లాభాలు పొందొచ్చన్నారు. పలువురు సమస్యలు విన్నవించడంతో మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఎల్లాపురం గ్రామ సర్పంచి మురళీకృష్ణ ఇంటి వద్ద ప్రయివేట్ ఫంక్షన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రైతులు, గొర్రెల కాపరులు, పశు సమర్థత శాఖ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గొర్రెలకు నట్టల మందు వేస్తున్న మంత్రి పార్థసారథి

ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

పలుచోట్ల సంస్మరణ సభలు

ప్రజాశక్తి - భీమడోలు

దేశం గర్వించదగ్గ, కార్మిక పక్షపాతి సీతారాం ఏచూరి మృతి దేశానికి, వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలు సిపిఎం కార్యాలయంలో ఆదివారం సీతారాం సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నాయకులు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా లింగరాజు హాజరై సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ దేశ అభ్యున్నతికి, పార్టీ సంక్షేమానికి సీతారాం ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నారపల్లి రమణరావు, కోన శ్రీనివాసరావు, నాగరాజు, వెంకట్ పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సీతారాం ఏచూరి, ఆర్.సత్యనారాయణ (ఆర్ఎస్) సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ముంగం సురేష్, సిపిఎం కార్యకర్తలు వీరవల్లి భాస్కరరావు, పరసా రాజేష్, అద్దాని వెంకటేశ్వరరావు, జ్ఞానేషు, మహాలక్ష్మి, బిల్డింగ్ వర్కర్స్ సభ్యులు అన్వర్ బాషా, బత్తిన వెంకట సూరిబాబు, కటికల శ్రీనివాస్, పలు ప్రజాసంఘాల సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.



భీమడోలులో...



కలిదిండిలో...

లోక్ అదాలత్‌లో 2,633 కేసుల పరిష్కారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 2,633 కేసులను పరిష్కరించినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. పురుషోత్తమకుమార్ తెలిపారు. వీటిలో 2,146 క్రిమినల్ కేసులు, 124 మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, 193 సివిల్ కేసులను రాజీ చేయగా 170 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 33 బెంచీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటిలో ఏలూరులో ఎనిమిది, భీమవరంలో నాలుగు, కొవ్వూరులో మూడు, నరసాపురంలో నాలుగు, తణుకులో నాలుగు, తాడేపల్లిగూడెంలో మూడు, పాలకొల్లులో రెండు, నిడదవోలులో ఒకటి, జంగారెడ్డిగూడెంలో రెండు, చింతలపూడిలో ఒకటి, భీమడోలులో ఒకటి చొప్పున బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో ఏలూరులో 954 కేసులు, భీమవరంలో 195, చింతలపూడిలో 117, జంగారెడ్డిగూడెంలో 121, కొవ్వూరులో 120, నరసాపురంలో 158, పాలకొల్లులో 108, తాడేపల్లిగూడెంలో 244, తణుకులో 219, నిడదవోలులో 202, భీమడోలులో 25 కేసులు (పెండింగ్ కేసులను) పరిష్కరించామని తెలిపారు. వీటిలో పాటుగా జిల్లావ్యాప్తంగా 940 పెట్టి కేసులను రాజీ చేసినట్లు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఆన్‌లైన్ ద్వారా 23 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. నరసాపురం, భీమవరం, తణుకు కోర్టులకు సంబంధించిన కేసుల్లో కక్షిదారులు ఏలూరులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై తమ కేసులను రాజీ చేసుకున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఇకముందు కూడా ఇటువంటి ఈ ఆన్‌లైన్ విధానం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని, తద్వారా సమయం డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. వాహన ప్రమాద బీమా కేసుల్లో రూ.7,82,26,000 పరిహారం కింద చెల్లించినట్లు, సివిల్ కేసుల్లో రూ.4,42,39,210, చెక్ బౌన్స్ కేసుల్లో రూ.8,64,70,600, కుటుంబ వివాద కేసుల్లో రూ.1,51,72,575 బాధితులకు చెల్లించినట్లు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్‌ఎన్ఎల్ వారికి, జిల్లా పంచాయతీ శాఖ వారికి, పత్రిక విలేకరులకు, రవాణా శాఖాధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖాధికారులకు, అడ్వకేట్ క్లర్కులకు, అగ్రికల్చరల్ అధికారులకు, మిగతా శాఖల అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య..!

వెంకటాపురంలో ఘటన

ప్రజాశక్తి - కామవరపుకోట

భార్యను చంపి భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రావికంపాడు శివారు వెంకటాపురంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తణుకు మండలం పిట్టల వేమవరం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న మానుపాటి శ్రీను (32)కు మండలంలోని వెంకటాపురానికి చెందిన సేనాపతి మరియమ్మ(27)కు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో వీరిద్దరి మనస్పర్థలు రావడంతో గొడవలు పడి సుమారు ఏడేళ్ల క్రితం విడిపోయారు. ఇటీవల సుమారు ఒక ఏడాది క్రితం పెద్దల సమక్షంలో ఇరువురికి సర్ది చెప్పి ఒకటి చేశారు. అప్పటి నుంచి శ్రీను లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ, వెంకటాపురంలోని తన అత్తవారింటిలో ఉంటున్న భార్య మరియమ్మ దగ్గరకు వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి శ్రీను ఇంటికి వచ్చాడు. భోజనం చేసిన తర్వాత శ్రీను, మరియమ్మ ఒక గదిలో, మరియమ్మ సోదరుడు, అతని భార్య మరొక గదిలో, మరియమ్మ తల్లి వారి గది బయట నిద్రించారు. ఉదయం శ్రీను, మరియమ్మ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో తలుపులు తెరిచి చూసేసరికి గదిలో మంచం మీద మరియమ్మ, ఉరేసుకుని శ్రీను విగత జీవులుగా కనిపించారు. భార్యాభర్తలిద్దరికీ తరచూ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో శ్రీను కావాలనే భార్య మరియమ్మకు నోటిలో పురుగుల మందు పోసి పీకనులిమి చంపేసి, తాను ఆత్మహత్య చేసుకున్నాడని మృతురాలి బంధువులు చెబుతున్నారు. జంగారెడ్డిగూడెం డిఎస్‌పి యు.రవిచంద్ర, జంగారెడ్డిగూడెం సిఐ డి.కృష్ణబాబు, తడికలపూడి ఎస్ఐ పి. చెన్నారావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మరియమ్మ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న డిఎస్‌పి రవిచంద్ర

విశ్రాంత ఇంజనీర్లకు సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంజనీర్స్ డే ను పురస్కరించుకుని సీనియర్ సిటిజన్సు వెల్ఫేర్ అసోసియేషన్ ఏలూరు వారు ఆదివారం తమ కార్యాలయంలో ప్రముఖ విశ్రాంత ఇంజనీర్లు అయిన కొల్లి రాజశేఖరరావు, ముక్కామల వెంకట కృష్ణారావులను ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షులు డాక్టర్ ఎన్ఎస్ఎస్వి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాదినీడి చౌదరి, శివరామకృష్ణారావు, పి.ఆంజనేయులు తదితరులు మాట్లాడారు. ఉపాధ్యక్షులు వడ్లపట్ల నారాయణరావు, అనేకమంది సంఘ సభ్యులు పాల్గొన్నారు. సన్మాన గ్రహీతలు తమ సుదీర్ఘ సర్వీసులోని అనుభవాలను సభికులతో పంచుకోవడమే కాకుండా తమకు జరిగిన సత్కారానికి కృతజ్ఞతలు తెలిపారు.



హిందీ భాష దినోత్సవంలో విద్యార్థులు

ఘనంగా హిందీ భాష దినోత్సవం

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి రాష్ట్రానికి వారి మాతృభాష ఉంటుందని, కాని దేశం మొత్తం మాట్లాడే భాష హిందీ అని కంభం అనురాధ తెలిపారు. హిందీ భాష దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రగడవరంలో ఘనంగా కంభం అనురాధ హిందీ టీచర్ వారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హిందీ భాష గొప్పతనం గురించి వివరించారు. హిందీ భాష నేర్చుకుంటే దేశంలో ఎక్కడికి వెళ్లినా భాషపరమైన సమస్యలు ఉండవని తెలిపారు. వీటిని విద్యార్థులకు తెలియచేయడానికి స్కిట్‌లు, డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమల ద్వారా విద్యార్థులచే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.రూపలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైవి.కృష్ణారావు ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలి

జయంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - చింతలపూడి

రైతు సంఘం రాష్ట్ర నాయకులు వైవి.కృష్ణారావు ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ కంపెనీలపై రైతాంగం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. చింతలపూడి సిపిఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో యార్లగడ్డ వెంకట కృష్ణారావు 110 జయంతిని ఆదివారం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య విచ్చేసి మాట్లాడారు. యార్లగడ్డ వెంకట కృష్ణారావు విద్యార్థి ఉద్యమం నుంచే ప్రజా సమస్యలపై పోరాడుతూ విద్యార్థి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నిర్మాణంలో భాగస్వాములై జాతీయ సమితి సభ్యుల స్థాయికి ఎదిగారన్నారు. శాసనమండలి సభ్యులుగా 12 సంవత్సరాలు పని చేశారన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని తీసుకొని రైతాంగ సమస్యలపై కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు మాట్లాడుతూ వైవి.కృష్ణారావు 1929లో పెదవుటుపల్లి విచ్చేసిన గాంధీని స్ఫూర్తిగా తీసుకొని స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, రైతు సంఘం నాయకులు తక్కెలపాటి ప్రసాదరావు, మాణిక్యాలరావు, బోడ ముక్తేశ్వరరావు, జిల్లెల్ల కృష్ణ, చేపల మడుగు నరసింహరావు, మా ఊరి ముత్తారెడ్డి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ఊటుకూరు గ్రామంలో పాతకక్షలు పురస్కరించుకుని ఈ నెల ఏడో తేదీ శనివారం ఉదయం జరిగిన హత్య కేసులో నిందితులును అరెస్టు చేసినట్లు కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్ తెలిపారు. ఆదివారం ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. ఊటుకూరు గ్రామానికి చెందిన పోసిన బాలకోటయ్యను ఆ గ్రామ పొలిమేరలో పాత కక్షల నేపథ్యంలో ప్రత్యర్థులు కత్తితో నరికి హత్య చేశారన్నారు. మృతుని కుమారుడు చైతన్య ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసినట్లు చెప్పారు. అంతట విచారణ చేయగా ఈ కేసులో ప్రత్యక్షంగా హత్య చేసిన వ్యక్తి గూడవల్లి శ్రీనుబాబుగా గుర్తించామన్నారు. గూడవల్లి శ్రీనుబాబు హత్య చేయడానికి పరోక్షంగా గూడవల్లి శ్రీనుబాబు తండ్రి శివాజీ, బాబాయి శ్రీనివాసరావు, పెదనాన్న మహంకాలరావు, అదేవిధంగా మృతుడు బాలకోటయ్యతో జెసిబి విషయంలో పాత కక్షలు ఉన్న మండలంలోని విశ్వనాద్రిపాలేనికి చెందిన పక్కిరి నాగరాజులు సహకరించినట్లు విచారణలో తెలిసిందన్నారు. శనివారం సాయంత్రం ఈ కేసులో నిందితులైన గూడవల్లి శ్రీనుబాబు, గూడవల్లి శివాజీ, గూడవల్లి శ్రీనివాసరావు, గూడవల్లి మహంకాలరావు, పక్కిరి నాగరాజులను అరెస్టు చేసి ఆదివారం రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరచినట్లు కృష్ణకుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కుక్కునూరు

మద్యానికి బానిసై పురుగుమందు తాగి మృతి చెందిన సంఘటన కుక్కునూరు మండలంలోని రామాలయం వీధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మాచర్ల లాలయ్య (56) తరచూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో అతని భార్య మాచర్ల నాగమణి మద్యం తాగొద్దని మందలి ంచినందుకు మనస్తాపానికి గురైన లాలయ్య పురుగుల మందు తాగి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రౌతుగూడెం గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం కోడిపందేల శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.నవీన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... రౌతుగూడెం గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.వెయ్యి నగదు, ఒక కోడి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆరుగురు చోరులు అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పొలాల్లో ప్లాస్టిక్ డ్రిప్‌లు, ద్విచక్రవాహనాలు దొంగలిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతకాలంగా రోడ్డు పక్కన పెట్టిన ద్విచక్ర వాహనాలుచ, పొలాల్లో నీటి సరఫరాకు ఉపయోగించే ప్లాస్టిక్ డ్రిప్‌లు చోరీకి గురవుతున్నాయని వస్తున్న ఫిర్యాదులతో ఎస్పి ప్రతాప్ శివ కిషోర్ పర్యవేక్షణలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ ఆదేశాల మేరకు నూజివీడు రూరల్ ఎస్ఐ లక్ష్మణ్ బాబుకు వచ్చిన సమాచారంతో వారి సిబ్బంది సహాయంతో నూజివీడు మండలం రావిచర్ల వాహన తనిఖీలు చేపట్టారు. పోలీసులను చూసి పారిపోతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు ఆగిరిపల్లి గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. వారు కొంతకాలంగా నూజివీడు మండలం, పట్టణం, ఆగిరిపల్లి, వీరవల్లి, విస్సన్నపేట, ఎ.కొండూరు, మైలవరం మండలాల్లో రోడ్డు పక్కన పెట్టిన మోటార్ సైకిల్ దొంగిలించి వాటిని విడిభాగాలుగా చేసి విజయవాడలోని గురునానక్ కాలనీలో సతీష్ అనే వ్యక్తికి అమ్ముతున్నట్లు గుర్తించారు. అలాగే పొలాల్లో రైతులు నీటి సరఫరాకు ఉపయోగించే ప్లాస్టిక్ డ్రిప్‌లను దొంగిలించి ఆటోలో వేసుకొని నెక్కలం గొల్లగూడెం గ్రామంలో విజయ్ అనే వ్యక్తికి కేజీ లెక్కన అమ్ముతున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.4.50 లక్షలు విలువైన పది ద్విచక్ర వాహనాలు, ప్లాస్టిక్ డ్రిప్‌లను రికవరీ చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

నేడు స్పందన కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పి ప్రతాప్‌శివకిషోర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఈ సోమవారం ఈద్ మిలాద్ ఉన్ నబి పండుగ నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

శతాధిక వృద్ధుడు వెంకట్రావు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురానికి చెందిన శతాధిక వృద్ధుడు అక్కిన వెంకట్రావు (101) శనివారం వయోభారంతో మృతి చెందగా ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన గతంలో నారాయణపురం అభివృద్ధికి తన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ సర్పంచిగా పోటీ చేసేందుకు సుముఖత చూపారు. నారాయణపురం సీటు 2001లో మహిళకు రిజర్వేషన్ ఖరారు అవ్వడంతో ఆయన కోడలైన అక్కిన నాగమణిని బరిలోకి నిలపగా అక్కిన వెంకట్రావుపై అభిమానంతో కోడలు సర్పంచిగా గెలిచారు. అలా తాను సర్పంచిగా గెలవాలనే కోరిక ఆయన కోడలి రూపంలో తీరింది. తరువాత కూడా గ్రామాభివృద్ధికి వెంకట్రావు సహాయ సహకారాలు అందించారని గ్రామస్తులు కొనియాడారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా టిడిపి'

ప్రజాశక్తి - కామవరపుకోట

టిడిపి కార్యకర్తలకూ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ తడికలపూడి గ్రామ అధ్యక్షుడు బొంతు వెంకటేశ్వరరావు అన్నారు. తడికలపూడి గ్రామానికి చెందిన అడ్వకేట్ నిట్టా సుందరరావు కుటుంబ సభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. ఇటీవల సుందరరావు తండ్రి టిడిపి సీనియర్ కార్యకర్త నిట్టా నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. నాగేశ్వరరావు కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఏలూరు పార్లమెంటు నాయకులు తూత లక్ష్మణరావు, మాజీ సర్పంచి మెరుగు సుందరరావు, కర్రి అబ్రహం పాల్గొన్నారు.

కంకర అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

పోలవరం కాలువ గట్టు ఉంగుటూరు మండలం గొల్లగూడెం - సింగరాజుపాలెం దారిలో కంకరను ఆదివారం అక్రమంగా తవ్వేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. పట్టపగలే మట్టి మాఫియా రాజకీయ నాయకుల అండదండలతో తవ్వకాలు చేస్తున్నారు. సంబంధిత అధికార యంత్రాంగానికి సమాచారం ఇచ్చినా తవ్వకాలు ఆగలేదు.

రైతులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - ముదినేపల్లి

వరదలతో ముంపు బారిన పడి పంట నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వడాలి, అప్పారావుపేట, చినపాలపారు తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వరదల కారణంగా ముంపు బారిన పడిన వరిచేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీనివాస్ రైతులతో మాట్లాడుతూ విపత్తు నుంచి ప్రజలను, రైతులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. ఎవరూ అధైర్యపడొద్దన్నారు.

వయోజన విద్యపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరంలో వయోజన విద్యపై ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గతంలో వయోజన విద్య ద్వారా సంతకాలు నేర్చుకున్న పలువురు వృద్ధులు, కార్మెల్ పాఠశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. చదువు ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. గుత్తికొండ వెంకటకృష్ణారావు, ఆకుల రాంబాబు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు శివారు అప్పారావుపేట గ్రామంలో వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ వినాయకుడిని దర్శించుకుని అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరంలోని రామకోటి సెంటర్‌లో ఉష బాలకృష్ణారావు సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా ఏలూరు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ హాజరై ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా ఏలూరు నగరంలో ప్రతి రెండు, మూడో శనివారం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ ప్రజలకు సేవలందిస్తున్న లయన్స్ మానేపల్లి రామారావు సేవలు అభినందనీయమన్నారు. ఏలూరు ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ప్రతివారం వినికిడి శక్తి కోల్పోయిన వారికి హియరింగ్ మిషన్లు అందిస్తున్నారని తెలిపారు.

పంటను ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి


ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజనులపై దౌర్జనం చేసి, పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు కోరారు. సిపిఎం బుట్టాయగూడెం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని టి.కట్టుపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిలో గత 30 ఏళ్ల నుంచి స్థానిక గిరిజనులు వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీ రాత్రి ఎనిమిది గంటల సమయంలో గిరిజనేతలకు అనుకూలంగా ఆర్‌డిఒ ప్రొడక్షన్ ఆర్డర్ ఉందంటూ పైదవారిగూడెం గ్రామానికి చెందిన రౌడీషీటర్ వేట్టి మాధవ్, నందపురం గ్రామానికి చెందిన గిరిజనేతలు గిరిజనులపై దౌర్జన్యం చేయటమే కాకుండా గిరిజనులు వేసిన ప్రత్తి మినప పంటను ధ్వంసం చేశారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న భూమిపై సమగ్ర రికార్డు వెరిఫికేషన్ చేయమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధల ముత్యాలమ్మ, మంగరాజు, మిచ్చె కన్నయ్య పాల్గొన్నారు.

అవార్డు మరింత ఉత్సాహన్నిచ్చింది

ఉత్తమ ఇంజనీర్ అవార్డు అందుకున్న డాక్టర్ తేజ సూరత్

ప్రజాశక్తి - ఏలూరు




అవార్డు అందుకుంటున్న డాక్టర్ తేజసూరత్

ఉత్తమ ఇంజనీర్ అవార్డు చాలా ఉత్సాహన్ని ఇచ్చిందని ఏలూరుకు చెందిన శ్రీసోమా కన్‌స్ట్రక్షన్, కన్సల్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంజనీర్ డాక్టర్ తేజ సూరత్ అన్నారు. ఆయన ఆదివారం ఉత్తమ ఇంజనీర్ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన హిందూ న్యూస్ పేపర్, రామ్ కో వారి ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే సందర్భంగా తిరుపతిలోని శ్రీ పద్మావతి ఉమెన్స్ యూనివర్సిటీలో ది బెస్ట్ ఇంజనీర్స్ అవార్డు పొందారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఇంజనీర్ అవార్డు అందుకోవడం మహాదనందంగా ఉందన్నారు. భారతదేశపు మొట్టమొదటి ఇంజనీర్ అయిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి రోజున ఇంజనీర్ల దినోత్సవం ప్రతి ఏటా జరుగుతుందన్నారు. 1968లో భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డేగా ప్రకటించిందన్నారు. ఆనకట్టల నుంచి జల విద్యుత్ ప్రాజెక్టుల వరకు ఆయన చీఫ్ ఇంజనీర్‌గా అనేక అద్భుతాల నిర్మాణాలను పర్యవేక్షించారన్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం ఇంజనీరింగ్ స్థిరమైన విధానంతో ఆధునిక సౌకర్యాలకు అనుగుణంగా పరిష్కారాలను రూపొందించడానికి ఇంజనీర్లను ప్రోత్సహించడం కోసం ఈ అవార్డులు అందిస్తున్నయన్నారు. ఈ అవార్డు పొందడం పట్ల చాలా ఉత్సాహం వచ్చిందన్నారు. ఉత్తమ ఇంజనీర్ అవార్డు అందుకున్న డాక్టర్ తేజ సూరత్‌ను పలువురు అభినందించారు.

వరద బాధితులకు సాయం అందించినవారికి కృతజ్ఞతలు

మంత్రి కొలుసు పార్థసారథి



మంత్రికి చెక్కు అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి నూజివీడు టౌన్

రాష్ట్రంలో వరద బాధితులకు సహాయం అందించిన దాతలందరికీ కృతజ్ఞతలని గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. వరద బాధితులకు సాయం అందించాలన్న మంత్రి పార్థసారధి పిలుపుతో నూజివీడు నియోజకవర్గ కూటమి నాయకులు కార్యకర్తల నుంచి గత పది రోజుల నుంచి సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం నూజివీడులో పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి పార్థసారధికి ఆగిరిపల్లి మండలం పొలసానిపల్లి గ్రామానికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు మాజీ సర్పంచి అందరూ కలిసి రూ.2,51,120 చెక్కును, చాత్రాయి గ్రామానికి చెందిన కె.చిన్నారావు, జి.శ్రీమన్నారాయణ ఇరువురు కలిసి రూ.పది వేల చెక్కును అందించారు. మంత్రి కొలుసు పార్థసారధి పిలుపు మేరకు టిడిపి, జనసేన, బిజెపి కూటమికి చెందిన కార్యకర్తలు విజయవాడలోని వరద బాధితులకు అనేక సహాయ సహకారాలను అందిస్తున్నారు. సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు, కూటమి సభ్యులకు పేరు పేరున మంత్రి కతజ్ఞతలు తెలిపారు. మంత్రి అందించిన స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు అన్నారు. ఆపద సమయంలో తోటివారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, తన పిలుపుతో సహాయం అందించిన కూటమి నాయకులు, కార్యకర్తలు సేవ మరువలేనిదని మంత్రి అన్నారు. నియోజకవర్గం నుంచి మరింతమంది స్వచ్ఛందగా ముందుకు వచ్చి విజయవాడ వరద బాధితులకు చేయూతనివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు :ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాత్రాయి మండల వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వదర బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. మంచినూనె, పంచదార, కందిపప్పు, ఉల్లిపాయలు, 30 కోడిగుడ్లు అందించారు. నూజివీడు పెద్ద చెరువు కట్ట వరద బాదిత 21 కుటుంబాలకు నిత్యావసరాలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, రవీంద్ర, లక్ష్మి, సుగుణరావు, సతీష్, ప్రభాకర్ పుల్లారావు, సుకుమార్ పాల్గొన్నారు.

ముసునూరు : టిడిపి బిసి సెల్ చాత్రాయి మండలాధ్యక్షుడు కంపసాటి చెన్నారావు, టిడిపి చాత్రాయి సీనియర్ నాయకులు గోగుల శ్రీమన్నారాయణ విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.పది వేలు అందించారు. మంత్రి కొలుసు పారథసారధిని మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామంలో కలిసి రూ.పది వేలు అందించారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్లేరు వరద వల్ల వేలాది ఎకరాలు చేపలు, రొయ్యల చెరువులు ముంపునకు గురై నష్టపోయిన ఆక్వా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు అన్నే భవనంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వాతావరణ మార్పులు, కొల్లేరు వరదల వల్ల ఆక్వా రైతులకు వందల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని చెప్పారు. ఏలూరు రూరల్, కైకలూరు, మండవల్లి, పెదపాడు తదితర మండలాల్లో ఆక్వా చెరువులకు ఎక్కువ నష్టం జరిగిందని తెలిపారు. ఇప్పటికే ఆక్వా రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని, భారీ వర్షాల వల్ల వచ్చిన వరదల వల్ల మరింత ఎక్కువగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన ఆక్వా రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు మాట్లాడుతూ కొల్లేరు వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు.

'వరద సహాయక చర్యల్లో చింతమనేనే స్ఫూర్తి'

దెందులూరు :దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చేస్తున్న నిరంతర ప్రజా సేవే వరద సహాయక చర్యల్లో తామంతా స్వచ్ఛందంగా భాగం కావటానికి ఆదర్శంగా నిలిచిందని దెందులూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, దాతలు తెలిపారు. దుగ్గిరాల లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను పలువురు కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంఎల్ఎ చింతమనేని దృష్టికి తీసుకురాగా సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల వచ్చిన వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు అండగా నిలుస్తూ పెదపాడు మండలం వసంతవాడకు చెందిన చింతల కృష్ణమూర్తి రూ.50 వేల చెక్కును ఎంఎల్ఎ చింతమనేనికి అందించారు. విపత్తుల సమయంలో నియోజకవర్గ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సేవలు తమకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చాయన్నారు. వరద సహాయక చర్యలతో పాటు నియోజక వర్గ అభివృద్ధిలో సైతం చింతమనేని ఆశయాలకు అండగా ఉంటామని పలువురు నాయకులు, దాతలు తెలిపారు. ఈ సందర్భంగా వరద సహాయక చర్యల నిమిత్తం విరాళాలు అందించి అండగా నిలిచిన దాతలను ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), లావేటి శ్రీనివాస్, బొప్పన సుధ, నంబూరి నాగరాజు, పార్టీ నాయకులు తాతా సత్యనారాయణ సహా పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పనపై ఆయిల్‌పామ్ రైతుల హర్షం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేసిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కి టిడిపి రైతు సంఘం మండల నాయకులు గంటా సతీష్ ఆదివారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని పామాయిల్ రైతులు ఆయిల్ పామ్‌కు గిట్టుబాటు ధర కల్పించాలని ఎంపీ పుట్టా మహేష్, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన వారు కేంద్ర ప్రభుత్వ మంత్రులు, వాణిజ్య పనుల శాఖ అధికారులను కలిసి రైతులకు గిట్టుబాటు ధర కోసం చర్చించారని తెలిపారు. సమస్యపై పోరాడి ముడి చమురు (క్రూడాయిల్)పై ట్యాక్స్‌ను 5.5 శాతం నుంచి 27.5 శాతం వరకు పెంచేవిధంగా ఎంపీ కృషి చేశారన్నారు. ఆయన కృషి వల్ల రైతులకు పామాయిల్ ఒక టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ధర పెరిగే అవకాశం ఉందన్నారు. వచ్చే నెల నుంచి పామాయిల్ టన్నుకు రూ.15,500 పెరుగుతుందన్నారు. వర్జీనియా పొగాకు, పామాయిల్ రైతులకు ధరను పెంచే విధంగా అంతేకాకుండా వందేభారత్ రైలు ఏలూరులో రైల్వేస్టేషన్‌లో ఆగే విధంగా కృషి చేసిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కు రైతుల తరపున ఏలూరు పార్లమెంటు పరిధిలోని రైతుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

కామవరపుకోట :కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్‌పై దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతం వరకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల టిడిపి కామవరపుకోట మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. గత పార్లమెంట్ సమావేశాల్లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచాలని తద్వారా ఆయిల్ పామ్ రేటు పెరగడానికి దోహదపడుతుందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతి పత్రం ఇచ్చారు. అంతేకాకుండా పార్లమెంట్‌లో ఈ సమస్యను లేవనెత్తి పామాయిల్ గెలలు టన్నుకు రూ.రెండు వేలు వరకు రేటు పెరగడానికి రోహదం చేశారని కొనియాడారు. ఇటీవల కాలంలో రైతులు పామాయిల్ ఉత్పత్తి ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ఉత్పత్తి చేస్తున్నారు. ఒకపక్క హార్వెస్టింగ్ కాస్ట్, మెన్యూర్ ధరలు పెరిగిపోయి ఎకరాకు రూ.40 వేల వరకు రైతులపై అదనపు భారం పడుతుందని తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రైతులకు కొంత ఊరట లభించిందన్నారు. దీనికి కృషి చేసిన సిఎం చంద్రబాబు, ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్, ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌లకు పామాయిల్ రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

చింతలపూడి :ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కు చింతలపూడి పామాయిల్ రైతుల తరపున టిడిపి మండలాధ్యక్షులు మాటూరి వెంకట రామయ్య, మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, జనసేన పార్టీ అధ్యక్షులు చిదరాల మధుబాబు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని రైతులు పామయిల్‌కు గిట్టుబాటు ధర కల్పించాలని ఎంపీ మహేష్‌కుమార్‌ను, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌ను కోరారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం, వాణిజ్య పన్నుల శాఖ అధికారులను కలిసి రైతుల గిట్టుబాటు ధర కోసం చర్చించి, పోరాడి ముడి చమురు (క్రూడాయిల్)పై ట్యాక్స్‌ను 5.5 శాతం నుంచి 27.5 శాతం వరకు పెంచే విధంగా కృషి చేసినట్లు తెలిపారు. దీంతో రైతులకు టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఈ నెల నుంచి పెరిగే అవకాశం ఉందని, వచ్చేనెల పామాయిల్ టన్నుకు రూ.15,500 ధరకు రావచ్చని అంచనా వేస్తున్నారు. ప్రత్యేకంగా వర్జీనియా పొగాకు ధరలు పెంచడం కోసం, పామాయిల ధరను పెంచడం కోసం, వందేభారత్ రైలుఏలూరులో స్టాప్ కోసం ఆర్డర్ కాపీని తెచ్చి ఇంప్లిమెంట్ చేసినందుకు ఆంధ్ర రాష్ట్ర రైతుల తరపున ఏలూరు పార్లమెంట్ పరిధిలోని ప్రజల తరపున ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చింతలపూడి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

ఏలూరులో నిర్వహించిన నేషనల్ షోటోకాన్ కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ 2024 అండర్ - 14 పోటీల్లో చింతలపూడి విద్యార్థులు 12 మెడల్స్ సాధించారని కరాటే కోచ్ సుమన్‌రాజు తెలిపారు. ఇ.అక్షయ, టి.అద్విక, డబుల్ గోల్డ్ మెడల్స్ సాధించగా టి.భగత్‌సింగ్ సిల్వర్, బ్రాంజ్, ఎం.అన్ను, సిహెచ్.సంహిత సిల్వర్, ఎం.మహీధర్, అష్రఫ్ హుస్సేన్, ఎండీ.జమాల్, టి.గోపీచంద్ బ్రౌంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులందరూ వారి వారి స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. మరీ ముఖ్యంగా చింతలపూడి పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలకు నిర్వహించిన రెండు విభాగాల్లో గోల్డ్ రావటం ఇంకా సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో బడేటి బుజ్జి, గారపాటి తపన చౌదరి, సినీ హీరో సుమన్ పాల్గొన్నారు.

ముత్తారెడ్డికి గారపాటి పరామర్శ

ప్రజాశక్తి - చింతలపూడి

ఇటీవల హైదరాబాద్‌లో బైపాస్ సర్జరీ చేయించుకుని మండలంలోని ఎర్రంపల్లి గ్రామంలోని స్వగృహానికి విచ్చేసిన చింతలపూడి ఎఎంసి మాజీ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డిని తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆదివారం కలిసి పరామర్శించారు. సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పునరంకితం కావాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కృష్ణప్రసాద్, చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ ఒంటెద్దు ఏసూ వరప్రసాద్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు తోట వెంకటనారాయణ, మండలాధ్యక్షులు తాడిపత్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.